# హోమ్ స్వీట్ హోమ్ (3)

లేడీస్ అండ్ జెంటిల్ ఉమెన్!

ఈ మగాళ్లు తిండి తినేసి విస్తరంతా నాకేసి లేచిపోయాక అందులో ఆడాళ్ళను తిండి తినమనడం అది పతివ్రతా ధర్మం అనడం చాలా ఘోరం!

అది గ్రేవు ఇన్సల్ట్ మరియు గ్రాస్ ఇన్‌జస్టిస్ టు ది ఫిమేల్ కయింద్.

దేవుడా నువ్వెంత రోగ్‌వి. (అనగా మాయా మానుష విగ్రహుడివి)

కట్నకానుకలు స్కూటర్లు సూట్లు బూట్లు మగాళ్ళకిచ్చి ఎంగిలి విస్తరాకుల్లో తినమని కడుపుతో వుండమని. పిల్లల్ని కనమని కన్నీటితో కాపురాలు సాగించమని మా మొహాల మీదరాసేవా?

ఏక్ థా రాజా - ఏక్ థా రాణీ అన్నట్లుండ వలసిన ఈ కష్టాల్ని మధ్య "ఎంగిలికూళ్ళు" తినే రూల్నెందుకు సృష్టించావు భగవాన్! శబరీ గిబరీ తెచ్చిన ఎంగిలికూళ్ళు నువ్వు తింటే తిన్నావు. మా కొద్దు. మేం గాడ్స్ కాదు.

నాకింకా గుర్తు.

చుట్టూతా మెళ్లో నగలు దిగేసుకుని పేరంటాళ్ళు కూర్చుని చెక్కపీటా వేసి ముందు అరిటాకు కవటాకు పరిచి ఆందిమీద ఎంచక్కా బంగారపు పువ్వు పొదిగిన కొత్త వెండి కంచం వేసి అందులో కిస్‌మిస్ జీడిపప్పు సేమ్యాలతో వండిన వేడివేడి పరవాణ్ణం పోసి ఆ ఘుమఘుమలాడే పరవాణ్ణంలో అడపకుచు ఫీజు నాలుగుయిచ్చ రూపాయలు వేసి పెళ్ళిలో మమ్మల్ని తినమన్నారు.

ఐ డోంట్ కేర్ - ఐ డోంట్ వాంట్ టు ఈట్ ఇన్ వన్ ఎంగిలికంచం అన్నా, అప్పుడు అంతా నన్ను ఝాన్సీ కీ రాణీ లా చూసి విసుక్కున్నారు.

అడబడుచుకి ఆఫ్టరాల్ ఫోర్ రుపీస్ నేనిస్తాను. నేను తిన్నుగాక తిన్ను అని స్ట్రయిక్ చేశాను. మీకు కూడా ఫోర్ రుపీస్ ఎక్స్ట్రాయిప్పి

స్తాను. మరో కంచం తెప్పించుకోండి అని ఆ కంచం నా ముందుకు లాక్కున్నాను.

పేరంటాళ్ళంతా గొల్లుమని నవ్వారు

నాకు పరవాణ్ణం అంటే బలేఇష్టం.

ఆ ఫోర్ రుపీసూ మావారి సిస్టర్ చేతిలో పెట్టి నా కంచం నాకు ఏర్పాటు చేసుకుంటే అంతా నన్నొక వపుకి నెంబరు వన్‌గా చూసేసి గింజుకు చచ్చారు.

కలకల్లాడుతూ చుక్కల్లో చంద్రుడిలా వెలగ వలసిన మా శ్రీవారి మొహం తుమ్మల్లో ప్రొద్దు గ్రుంకినట్లుంది.

మొగుడు ఎంగిలి పనికిరానిది రేపు దీనికి మొగుడితో కాపురం పనికొస్తుందా అని అమ్మ లక్కలు చీకు ప్రెస్ చేసుకుంటున్నారు,

ఇదిఎప్పటి ముచ్చటో.

తర్వాత మొన్నీ మధ్య - భోంచేస్తుంటే నా కంచంలోంచి గోంగూర పచ్చడిని తీసి తన కంచంలో వేసుకున్నారు మావారు కావాలనే.

ఐ ఆబ్జెక్ట్ యువరానర్ అన్నా.

నాకు ఎంగిలిలేదు అన్నారు.

నాకుంది నే నొప్పుగోను. అని నా గోంగూర పచ్చడి మళ్ళా నేను తీసేసుకున్నా.

ప్రేమ గట్టిపడి పాతివ్రత్యం నిలబడి ఐదోతనానికి లోకా లేకుండా జీవితం సాగాలంటే ఆడది ముఖ్యంగా మొగుడు తిని పారేసిన ఎంగిలి విస్తట్లోనో ఎంగిలి కంచంలోనో తినాలిట.

హోమైగాడ్ - ఆ రూలు మొగాళ్ళు పెట్టారో ఆడళ్ళు పెట్టారో నాకైతే తెలీదు కాని - స్త్రీల దినపత్రికకు నేను ఎడిటర్నైతే "ఎంగిలి తిళ్ళు" మీద ఘాటైన సంపాదకీయం వ్రాద్దును ముచ్చటగా మూడు కాలాలు.

ఈ మంగళసూత్రం పుస్తెలతాడు ఆడాళ్ళే ఎందుకు కట్టించుకోవాలి? మొగాళ్ళు కూడా పసుపు రాసుకుని కాటుకా బొట్టూ ఎందుకు పెట్టుకోకూడదు? పెళ్ళి కొడుకు పెళ్ళికూతురి మెళ్లో మంగళసూత్రం కడితే- అది రైటంటున్నాం. పెళ్ళికొడుకు మెళ్ళో పెళ్ళికూతురు మంగళసూత్రం ఎందుకు కట్టగూడదు? ఆడదానికి పెళ్ళయితే దీనికి పెళ్ళయిపోయిందని లోకానికంతా తెలుస్తుంది. మొగాడికలా తెలియక్కర్లేదా?

ఇప్పుడు ఆడపీనుగులు కూడా పాంట్లు. స్లాకులు ఆఘోరిస్తున్నారు కదా: ఒక్క మొగాడైనా మనచీరగాని రవికగాని కట్టుకోవాలనుకోటం లేదు. ఆడాళ్ళు మగాళ్ళ డ్రస్ అనుకరిస్తున్నారుకదా మొగాళ్ళు ఆడాళ్ళ వేష భాషలు. కటూ బొట్టూ అంతా దానిస చిహ్నాలుగాచేసి అవే మంగళ ప్రదాలు. ఆ మేరమీరితే పతివ్రతా లక్షణాలు కావని ఆడాళ్ళను బెదిరించి పారేశారు.

పతివ్రతా లక్షణాలు ఆడాళ్ళకే కాని మగాళ్ళకు అక్కర్లేదా?

మొగుడు చచ్చిపోతే ఆడది వెధవముండట. దానికి నెత్తిమీద జుట్టుగొరిగించి ముసుగేసిమూల కూర్చోపెడతారు.

పెళ్ళాం చచ్చిపోతే మగాడు వెధవముండా కొడుకు అవక్కర్లేదా?

మీ కన్నతల్లి అయినా మీ చెల్లెలయినా ఎవరైనాసరే నిర్దయగా "వెధవముండ" (ది వీడో) అనేస్తారా?

పెళ్ళాం చచ్చిపోయిన వాడిని వెధవముండా కొడుకు అని

చూడండి. డొక్క చీలుస్తారు. తెలుగు డిక్షనరీలో వితంతువు అనే మాటకు పుంలింగం లేదు ఇంగ్లీషులో విడోయర్ అనివుంది. విధురుడు అని వుందిట కాని అది వాడుకలో లేదు.

నిద్రలేవగానే చెల్లెలైనా, కూతురైనా కోడలైనా అప్పగారైనా ఆఖరికి తల్లయినా సరే విడో ముఖం కనపడకూడదుట. ఎవరికీ ఎదురుగా రాకూడదుట అపశకునకుంట.

మనవాళ్ళెంత రోగ్స్. ఆయుర్దాయం మూడో అకస్మాత్తుగానో కట్టుకున్న పురుషుడు హరీమంటె ఆ అభాగ్యురాలు "దుష్ట శకునం" అయిపోయిందా? ఎలా అయిందర్రా ఫూల్స్....

పెళ్ళాంచచ్చిన మగాడు తన కూతురివయసు పిల్లకేసైనా నోటంబట నీళ్ళుకారుస్తూ చూస్తాడే. మగాడికి పెద్దగా వావివరసా అక్కర్లేదా? (నిజం చెప్పండర్రా) నన్నడిగితే సృష్టిలో వియోగదుఃఖం ప్రాణికోటికి సమానమే!

వియోగదుఃఖంతో కుమిలిపోయే ఆడదానికి వితంతుయోగం కల్పించిన కుళ్ళు సమాజం ఎంత అన్యాయం అక్రమం తలపెటింది ఆడదానికి? (అగ్గిపుల్లగీసెయ్యాలి ఈ సైటీకి) ఈ కాపురాలన్నీ మాయా నాటకాలు. ఈ ప్రేమలన్నీ దొంగనటనలు బెస్ట్ ఏక్టర్స్ మనవాళ్ళ. ఆడదంటే ఎంతప్రేమో గౌరవమో మనవాళ్ళకి పరీక్షించేందుకు ఎంగిలికూళ్ళు ఎగ్జాంపుల్ చాలు!

ఒక ఆడది ఒకసామాన్య సంసారంలో ఎంత చాకిరీ చేస్తుంది? (సెలవు అడక్కుండా చచ్చేదాకా) ఆడాళ్ళుచేసే చాకిరీలో ఎన్నోవంతు మగాళ్ళు చేస్తారు?

చీరెలు నగలు కాళ్ళకుపట్టాలు అన్నీ కొని సంకెళ్లువేసి 'హోమ స్వీట్ హోమ' యిల్లేకదా స్వర్గసీమ అని మీ చేతే పాడించి కాస్త యిటూ అటూ అయితే మిమ్మల్ని కూరాకులో పురుగులా తీసి పారేస్తూంటారు.

ఆడదానికి మొగుడి కవుగిల్లోకూడా సోషల్ సెక్యూరిటీ లేదు.

ఇప్పటికీ ఎప్పటికీ మగపిల్లాడుపుడితే మగ మహారాజు పుట్టాడం టారు. ఆడపిల్లపుడితే ఆడముండ పుట్టుకొచ్చిందమ్మా కొంపంతా దోచుకు తినడానికి అని మొహంమీద అనేస్తారు. ఆడపులిని అలా అన మనండి చూస్తాను.

వో పంజెరంలో చిలకల్లారా!
రంగుచీరలు చుట్టుకున్న రమణీమణుల్లారా!
అక్కలారా! అమ్మల్లారా!
బంగారపు గిన్నెలారా! వెండి కుంకుంభరిణె
ల్లారా! మీరంతా ఆటబొమ్మలు.

గడపలకు పసుపులురాసి తోరణాలుకట్టి యిళ్ళుకడిగి వాకిళ్ళలో ముగ్గులెట్టి ఆటలు ఆడి. పాటలుపాడి సంతోషంగా వున్నామని పొంగి పోతూంటారు. (ఇడియట్స్) మీకు వ్యక్తిత్వంలేదు. మీకు గౌరవంలేదు. ఏ ఆడదైనా ఎదురుతిరిగితే మగాళ్ళేం చేయగలరో అప్పుడు మీకు తెలు స్తుంది తల్లివైనా సరే తన్ని కూర్చోపెడతారు. పుత్రదండవ) మనదే పుళ్ళు. మనమతం. మన పురాణాలూ. శాస్త్రాలూ ఆఖరికి మనచవట సినిమాలుకూడా ఆడదాన్ని పొగిడి బుట్టలో వేసుకున్నాయి.

సృష్టిలో ప్రతి ప్రాణికీ వియోగమేకాని వైధవ్యంలేదు. ప్రతిస్త్రీ చెల్లెలో. అక్కో. కోడలో. అత్తో - అమ్మో అందరూ నిత్యసువాసినులే

—మొగాళ్ళకులేని వైధవ్యం ఆడాళ్ళకులేదు. వుండకూడదు. దబ్బెట్టి ఆడ పిల్ల మొగుడ్ని కొనుక్కొని వాడికి ఆ రాస్కెల్‌కి చెప్పులజోడు దగ్గర్నుంచి తన తండ్రి సొమ్ము పచ్చినెత్తురు కర్చుపెట్టించి ఆ మొగుడితో సుఖంగా సంసారం చేయాలనుకుంటుంది. నిజమే! పచ్చినెత్తురు తాగే మగాళ్ళతో దబ్బెట్టి కొనుక్కొన్న సుఖసారం సంసారం — ఆ సంసారంలో మిథ్యాసుఖాన్ని నిజమనుకొని ఆడాళ్ళు గానుగెద్దుల్లా కాపురాలు సాగిస్తూంటారు. ఇవన్నీ పాపం మన రచయితలకు తట్టవు. కనిపించవు. ఎంతసేపూ హీరోతో లవ్వాడతారు. మేడలూ కార్లూ చీరెలూ నగలూ వీటిచుట్టూ కథలల్లుతారు. మనిషిని ఒక చర్మంపొర వూడదీసి పరీక్షించి రాస్తేరాయాలి. ఆడాళ్ళు నవలలు రాస్తే డబ్బొస్తుందని తెలిస్తే తన్ని ఆడాళ్ళ చేత నవలలు రాయిస్తారు ఈ మగాళ్ళు. ఆడాళ్ళను పంపితే సానుకూలమవుతాయంటే ఆడాళ్ళను పంపి పనులు (రాజకీయాలు) సానుకూల పరుచుకుంటారు. ఎంటాసిదర్ల కుటుంబాల్లో స్త్రీలు రాజకీయ చతురంగంలో ఆడబడే పావికలు. స్త్రీ ఒకప్రాణంవున్న పనిముట్టు (చలంగారి దోష గుణం కథ చదవండిబాలు)

జీవితాంతం తిండి. బట్టయిచ్చి పోషించే మగాడ్ని సంపాదించుకుందుకు ఆడపిల్లవలపు సొగసు సోయగాల్ని గుమ్మరిస్తేచాలదు - థవుజండ్స్ ఆఫ్ రుపీస్ గుమ్మరించాలి! మీవాకిలి కుక్కలాగ మీ పాదాలచెంత చోటు కోసం — మీ పక్కలోచేరి మీకు సుఖమిచ్చి మీకు పిల్లల్నికని వాళ్ళని పెంచి పెద్దచేసి మళ్ళా వాళ్ళచేత నీతులు చెప్పించుకునే దుర్దశపట్టిందా అమ్మా అక్కా చెల్లీ వదినా అత్తా మీకు....

హోవ్ మైగాడ్! ఇంక నేవ్రాయలేను. రాయలేను, రాయలేను. నా కలంలో కన్నీరింకిపోయింది.